చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

సాహితీ 'ప్రియ' సవ్యసాచి

(నవంబర్ 21న దేవీప్రియ వర్ధంతి)

కవిగా, రచయితగా, జర్నలిస్టుగా, రన్నింగ్ కామెంట్రీ రచయితగా, కార్టూనిస్టుగా, కథా రచయితగా, రేడియో నాటకాలు, రంగస్థలం నాటకాల రచయితగా, సినిమాలకు స్క్రిప్ట్ రైటర్‌గా, పాటల రచయితగా.. ఇలా అన్నీ తానై అన్నింటా తానై వెలుగొందిన దేవీప్రియ అందరికీ సుపరిచితులు. కవితల మాంత్రికుడు దేవీప్రియ గుంటూరు జిల్లా తాడికొండలో 1949 ఆగస్టు 15న షేక్ హుస్సేన్ సాహెబ్, షేక్ ఇమాంబీ పుణ్యదంపతుల ఇంట సాహితీమాత వరాలపంటగా జన్మించారు. అసలు పేరు షేక్ ఖాజా హుస్సేన్.

రచనారంగంలో అరంగేట్రం చేసిన తర్వాత 'దేవీప్రియ' అనే కలం పేరుతో హుస్సేన్ విఖ్యాతి పొందారు. కాలేజీలో చదివే రోజుల నుంచే కవితలు, కథలతో తన సాహితీ ప్రస్థానాన్ని ఆయన ప్రారంభించారు. గుంటూరు కేంద్రంగా అవతరించిన పైగంబరకవులలో ఆయన ఒకరు.

కథకుడిగా మొదట సాహితీరంగంలో అడుగుపెట్టి, ఆ తర్వాత కవిత్వం వైపు తన అక్షరాన్ని మళ్లించి కవిత్వంలో నూతన ఒరవడి సృష్టించారు దేవీప్రియ. 'అమ్మ చెట్టు' వీరి మొట్టమొదటి కవితా సంపుటి. గరీబు గీతాలు, నీటిపుట్ట, అరణ్యపురాణం, తుఫాన్ తుమ్మెద, గాలి రంగు, చేపచిలుక, సమాజానంద స్వామి, గంధకుటి, ఇన్నా అల్లాహ్... లాంటి ఎన్నో కవితా సంపుటాలు ఆయన వెలువరించారు. ఆయన కవిత్వంలో ధిక్కారం ఉంటుంది, ప్రశ్నించే తత్వం ఉంటుంది. పద సంయోజనంలో సాధికారత సాధించిన కవి దేవీప్రియ. సుతిమెత్తని కవిత్వాన్ని ఒత్తుగా అల్లిన విశిష్ట కవి. కొత్త ఊహలు చేయడంలో అందెవేసిన చెయ్యి. దేవీప్రియ జర్నలిస్టుగా అనేక పత్రికల్లో విశిష్ట సేవలు అందించారు. అలాగే ఆయన పత్రికల్లో రాసిన రన్నింగ్ కామెంట్రీకి విశిష్ట స్థానముంది.

సినిమా రంగంలోనూ ఓ వెలుగు వెలిగారాయన. బి.నరసింగరావు దర్శకత్వం లో వచ్చిన మా భూమి, దాసి, రంగుల కల వంటి జాతీయ పురస్కారాలు పొందిన సినిమాలకు స్క్రిప్టులు, పాటలు రాశారు. ఆయన రచించిన జమ్ జమల్ మర్రి అనే పాట అశేష ప్రేక్షకాదరణ పొందింది. రేడియో నాటకాలు, రంగస్థల నాటకాలు ఆయన కలం నుంచి జాలువారాయి. అనిశెట్టి గారితో కలిసి సహాయకుడిగా 11 సినిమాలకు పాటలు, మాటలు రాశారు.

దేవీప్రియ బహుభాషా కోవిదులు. ఎన్నికల నిర్వహణలో కేజే రావు గురించి 'ది కోబ్రా డాన్సర్' పేరుతో ఆంగ్లంలో జీవిత కథ రాశారు. అలాగే మైఖేల్ జాక్సన్ రాసిన కవితని తెలుగులోకి అనువదించారు. దేవీప్రియ రాసిన వాటిల్లో 'దాంపత్య ప్రణయ కవిత్వం' ఆయన స్పెషలైజేషన్. సాహిత్యంలో దేవీప్రియ చేసిన సేవలకు గానూ ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. 2017లో గాలి రంగు కవితా సంపటికి ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. సాహితీ సవ్యసాచిగా సుప్రసిద్ధి పొందిన దేవీప్రియ 2020 నవంబర్ 21న కన్నుమూశారు.

పింగళి భాగ్యలక్ష్మి
97047 25609

బాదరాయణ సంబంధం..!

కొంత పురాణ పాండిత్యం ఉన్నవారికి బాదరాయణుడు అంటే వ్యాస భగవానుడే గుర్తుకువస్తాడు. పురాణ పాండిత్యం లేనివారికి బాదరాయణ సంబంధం అంటే ఏమిటో అర్థం కాదు. ఇలాంటివారి దగ్గర ఏదో ఒకటి వాగేస్తే సరిపోతుందనుకుంటే తర్వాత తర్వాత వారి అర్థ రహిత వాగుడే వారి తలకు పామై చుట్టుకునేటట్లు కాలం తన ధర్మాన్ని తాను నిర్వర్తిస్తుందన్నది కాల ధర్మం.

ఆంగ్ల భాష ప్రభావంతో తెలుగు నాట సామెతలు, నానుడులు, పొడుపు కథలు వంటివి తగ్గుముఖం పట్టాయి. విద్యారంగంలో అక్కడక్కడ కనిపిస్తున్నప్పటికీ, అవి పరీక్షలకే పరిమితమవుతున్నాయి. వాడుకలో మాత్రం తగ్గిపోతున్నాయి. సామెతలు, నానుడులు, పొడుపు కథలు మన ప్రాచీన ఆచార వ్యవహారాలను, సంస్కృతి, సంప్రదాయాలను, విజ్ఞాన విషయాలను తమలో నిక్షిప్తం చేసుకుని ఉంటాయని పెద్దలు చెబుతారు.

అలాగే మన యాస, బాష, కట్టు, బొట్టు ఒట్టు, కనికట్టుల మూలాలన్నీ సామెతల్లో దర్శనమిస్తుంటాయి. అయితే అందులో కొన్ని సామెతలు, నానుడులు కుల, మత, వర్గ వైషమ్యాలను పెంచి పోషించేవి విధంగా ఉంటాయన్న విషయం మరిచిపోరాదు.

సామెతలు, నానుడులను కొన్నిటిని జాగ్రత్తగా పరిశీలిస్తే వాటి వెనుకనున్న అర్థాలకు ఆయా పదబంధాలకు అసలు సంబంధం ఉండదు. దీనినే అర్థ విపరిణామం అని భాషా శాస్త్రవేత్తలు రకరకాల నిర్వచనాలను ఇస్తారు. నిర్వచనాల సంగతి పక్కనపెడితే అలాంటివి సమాజానికి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తాయి. ముఖ్యంగా పెద్దల మార్గాన్ని అనుసరించాలనుకునే సాత్వికులు ఇలాంటి సామెతలు, నానుడులు వంటివి విశ్వసించి ఇబ్బందులకు గురవుతుంటారు.

ఉదాహరణకు బాదరాయణ సంబంధం అనే పద ప్రయోగాన్ని తీసుకుందాం. 'ముక్కు మొహం తెలియనివాళ్ల దగ్గరకి వెళ్లి తెలివిగా ప్రవర్తించి తన అవసరం తీర్చుకోవడం కోసం ఏదైనా ఒక సంబంధం కలుపుకోవడానికి వేసే ఎత్తుగడ'నే బాదరాయణ సంబంధం అని అంటారు. మన పండితుల్లో ఎక్కువ మంది ఇదే అర్థాన్ని చెబుతారు. అలాగే వివిధ నిఘంటువులు కూడా ఇదే అర్థాన్ని చెబుతున్నాయి.

బాదరాయణ సంబంధం అనే అంశంపై మనవారు ఒక కథ కూడా చెబుతారు. అదేమిటంటే.. ఒక పెద్దాయన ఎద్దులబండి మీద వేరే ఊరికి వెళ్తున్నాడు. మధ్యాహ్నం 12 గంటలు దాటింది. ఆయనకు బాగా ఆకలి వేసింది. దీంతో రేగు చెట్టు ఉన్న ఒక ఇంటిని చూసి ఆగాడు. ఇంట్లోకి వెళ్లాడు. ఆ ఇంట్లో ఇల్లాలు మాత్రమే ఉంది. ఆమెను కుశల ప్రశ్నలు అడిగి, తను ఆమె భర్త బంధువుగా పరిచయం చేసుకున్నాడు. కొంచెం సమయం అయ్యాక ఆమె భర్త వచ్చాడు. తన అతని భార్య బంధువుగా అతన్ని పరిచయం చేసుకున్నాడు. చక్కగా అందరూ భోజనాలు చేశారు. మళ్లీ బంధుత్వ చర్చ వచ్చినప్పుడు భార్య 'ఆయన మీ బంధువట కదా?' అంటుంది. 'కాదు, కాదు.. మీ బంధువేనట కదా?' అని భర్త అంటాడు. అప్పుడు ఇద్దరూ కలిసి ఆయనతో 'అయ్యా! మీకూ, మాకూ సంబంధం ఏమిటి?' అని అడుగుతారు. అప్పుడు ఆయన ఇలా చెబుతాడు.

'యుష్మాకం బదరీ చక్రం అస్మాకం బదరీ తరుః.. బాదరాయణ సంబంధో యూయం యూయం వయం వయం'

దీన్ని బట్టి అతగాడు సంస్కృత భాషా పండితుడు అని తెలుస్తుంది. (శ్రీ సూర్యరాయాంధ్ర అయిదవ సంపుటం 90వ పేజీలో ఈ శ్లోకం ఉంటుంది.) మా బండి రేగు చెక్కతో తయారు చేయబడింది. మీ ఇంటి ముందు రేగు చెట్టు ఉంది. ఇదే మన సంబంధం బాదరాయణ సంబంధం అని ఈ శ్లోకానికి అర్థం. నిజానికి బాదరాయణ సంబంధం అనే పదబంధానికి ఈ కథకు ఎలాంటి సంబంధం లేదు. అలాగే వెర్రిబాగులవాడిని, అసమర్థుడిని బాదరాయణుడు అని పిలుస్తారు. వాడుత్త బాదరాయణుడు అంటే పనికి మాలినవాడని అర్థం.

నిజానికి బాదరాయణుడు అంటే వేదవ్యాసుడు అని అర్థం. బదరీ ద్వీపంలో పుట్టినందు వలన వ్యాసునికి బాదరాయణుడు అనే పేరు వచ్చింది. బాదరాయణుడు అని పిలవబడే వ్యాసుడు వెర్రివాడు కాదు. పంచమ వేదం అనదగిన మహాభారతాన్ని గణపతి రాస్తుండగా తను చెప్పాడు. అలాంటి బాదరాయణుడు వెర్రివాడు ఎలా అవుతాడు? అంటే కొందరు పండితులు 'ఆ.. ఇదంతా జానపదులు ఎవరో కల్పించారండి' అంటూ ఆ తప్పును జానపదుల మీదకు తోసేస్తారు. మరికొందరు బాదరాయణుడు.. ఆ బాదరాయణుడు కాదండి' అంటారు.

కొంత పురాణ పాండిత్యం ఉన్నవారికి బాదరాయణుడు అంటే వ్యాస భగవానుడే గుర్తుకువస్తాడు. పురాణ పాండిత్యం లేనివారికి బాదరాయణ సంబంధం అంటే ఏమిటో అర్థం కాదు. ఇలాంటివారి దగ్గర ఏదో ఒకటి వాగేస్తే సరిపోతుందనుకుంటే తర్వాత తర్వాత వారి అర్థ రహిత వాగుడే వారి తలకు పామై చుట్టుకునేటట్లు కాలం తన ధర్మాన్ని తాను నిర్వర్తిస్తుందన్నది కాల ధర్మం.

ఇక పై కథ, శ్లోకం ప్రకారం సశాస్త్రీయంగా ఆలోచిస్తే అది బదరీ సంబంధం అవుతుంది కానీ, బాదరాయణ సంబంధం కాదు. పురాణాల లెక్క ప్రకారం హిందువుల పూజలో ప్రధానంగా నిలిచే వృక్షాల్లో బదరీ ఒకటి. సూర్య భగవానునికి రేగు పండ్లు అంటే మహా ఇష్టం. బద్రీనాథ్‌లో ఉన్న బదరీ నారాయణునికి రేగు పండ్లు అంటే ఇష్టం. అరణ్యంలో ఉన్న శ్రీరామచంద్రుడు తండ్రి చనిపోయాడని తెలియగానే బదరీ పండ్లతోనే తండ్రికి పిండ ప్రదానం చేశాడు. శ్రీరామునికి శబరి తినిపించినది కూడా రేగు పండే. నర నారాయణులు బదరీ వనమునందే తపస్సు చేశారని పోతన గారి కింది పద్యం ద్వారా తెలుస్తున్నది.

'అనఘులు బదరీవనమున
వినుత తపో వృత్తి నుండ,
విబుధాధిపుడున్
మనమున నిజ పద హానికి
ఘనముగ చింతించి
దివిజకాంతామణులన్'

ముక్కూ మొ హం తెలియని వాడి దగ్గరకు వెళ్లి తెలివిగా ప్ర వర్తించడం అనే అర్థాన్ని చెప్పడం కూడా నూ టికి నూరు శాతం అశాస్త్రీయమే. అయితే, ఈ బాదరాయణ సంబంధం పద సృష్టి ఎలా జరిగింది? అంటే వ్యాస భగవానునిది, గణపతిది బాదరాయణ సంబంధం. వ్యాసుడు చెబుతుంటే పంచమ వేదం అనదగిన మహాభారతాన్ని గణపతి రాశాడు. బంధువు కాకున్నా, శిష్యుడు కాకున్నా, మిత్రాదులు కాకున్నా పవిత్ర కార్యంలో పాలుపంచుకున్న వారిని ఉద్దేశించి 'మీది బాదరాయణ సంబంధం' అని అనాలి. అంతేగానీ ముక్కూ మొహం తెలియని వాని దగ్గరకు వెళ్లి అతి తెలివిని ప్రదర్శించినవానిది బాదరాయణ సంబంధం అనడం, అలాగే వెర్రివాని సంబంధం బాదరాయణ సంబంధం అనడం వలన పురాణాల మీద గౌ రవం కంటే అవహేళన అధికంగా కలుగుతుంది.

వాగుమూడి లక్ష్మీరాఘవరావు
62814 90160

కవి సమ్మేళనం

ఆరు నెలల పాప తండ్లాడుతూ తండ్లాడుతూ
మరో పక్కకు బోర్లా పడబోవడమే క్రియాశీలత

పడుకోనున్నప్పుడు మాటల అలికిడి గమనించి
చూపులన్నీ నవ్వులై పూయడమే శిల్ప రహస్యం

చిన్ని చిన్ని కాళ్లురెక్కలు లయాత్మకంగా ఆడిస్తూ
మిన్నంటే కీకలు పెట్టడమే పద పదాల ఆలాపన

పడుకోనున్న తనే ముసు ముందుకు పరితపిస్తూ
మోకాళ్ల మీంచి అంబాడటమే వాక్య నిర్మాణం

గదిలో గోడల ఆసరాతో నిలబడే ఎత్తుగడలే
దీర్ఘ కవిత్వ చలనానికి వస్తువుల ఎంకులాట

పడుతూ లేస్తున్న బుడ్డ పాదాల ప్రయోగాలు
సృజించబోయే పద్య పాద విభజనకు ఊహలు

ఇంతింతై ఎదుగుతున్న శిశువే సృజన రూపం
నవ్వులు నడకలు ఇంటిల్లిపాదికీ కవి సమ్మేళనం.

అన్నవరం దేవేందర్
94407 63479

ఆవిష్కరణ

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి మినీ హాల్ (మొదటి అంతస్తు)లో ఈ నెల 23న సాయంత్రం 5 గంటలకు డాక్టర్ వెల్లండి శ్రీధర్ రచించిన 'కథా కచ్చీరు' తెలంగాణ కథా సాహిత్య విమర్శ పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంది. ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సి.కాశీం సభాధ్యక్షులుగా వ్యవహరిస్తారు. ముఖ్య అతిథిగా ఆచార్య వెల్దండ నిత్యానందరావు, ఆవిష్కర్తగా డా.కె.శ్రీనివాస్, విశిష్ట అతిథిగా డా.మామిడి హరికృష్ణ, ప్రధాన వక్తగా ప్రొ.కె.లావణ్య, ఆత్మీయ అతిథులుగా డా.సంగిశెట్టి శ్రీనివాస్, వలీ హుస్సేన్ పాల్గొంటారు. తొలి ప్రతిని డా.సరోజన బండ స్వీకరిస్తారు.

-టి.వి.నారాయణ, ఎలగొండ రవి, ఆడెపు లక్ష్మణ్
మానేరు రచయితల సంఘం.

నల్ల వజ్రమూ నిప్పు సంద్రమూ

ఇదొక ట్రావెలాగ్. ఇదొక అనువాదం. సైకిల్ మీద వచ్చే నాన్న కోసం ఎదురుచూసే పసితనపు దారుల్లో అమ్మ మరణాన్ని రద్దు చేసే జీవగర్ర దొరికితే బాగుండుననుకునే కథకురాలు బొగ్గుబావుల చీకటి వెలుగుల్లో తిరుగాడిన ట్రావెలాగ్ ఇది. ఒక ప్రాంతాన్నీ, ఆ ప్రాంత జీవితాలనూ తప్పొప్పులు ఎంచకుండా తీర్పరిగా కాక తటస్థంగా కథలుగా తిరగరాసిన రచన ఇది. యాత్రారచనలు కూర్చిన, పరాయి భాషలను అనుసృజించిన రచనానుభవాలు ఒక ప్రాంత నిజ జీవిత శకలాలను కథలుగా మార్చే ట్రావెలాగ్‌గా మారడం బహుశా కథకురాలి కథాయాత్ర స్వర్ణయుగారంభం కావచ్చు. ఆ కథకురాలు స్వర్ణ కిలారి. ఆ ప్రాంతం కొత్తగూడెం ఉరఫ్ సింగరేణి. ఆ కథలు బొగ్గు కథలు అలియాస్ 'నల్ల బంగారం' కథలు.

సింగరేణి అనబడే కొత్తగూడెం ప్రాంత అస్తిత్వం విచిత్రమైనది. ఈ నల్ల బంగారులోకానిది ప్రత్యేకమైన ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక జీవనం. పేరుకే కొత్తగూడెం కానీ, అది కొత్తదీ కాదు, గూడెమూ కాదు. అది నక్సల్బరీ పోరాటమంత సనాతనం. అది సికాస నినాదమంత ఆధునికం. ఖమ్మం మట్టిలోంచి నిప్పుకణికలు రగిల్చిన తెలంగాణ ఉద్యమ గడ్డ అది.

సరే. మరి గూడెం అన్నాక మనుషులుంటారు కదా. మనుషులన్నాక వాళ్లకు జీవితాలూ ఉంటాయి కదా. ఆ జీవితాల్లో నవ్వులుంటాయి. కానీ, వాటికి కన్నీళ్లుంటాయి. దుఖాలుంటాయి. కానీ, అవి నవ్వులు నటిస్తాయి. భయం ఉంటుంది. కానీ, అది ధైర్యం వేషంలో ఉంటుంది. ఆ జీవితాలకు మాయామర్మాలు తెలియవు. కానీ, వాళ్లు మాయామర్మాలకు గురవుతారు. వాళ్లు ఎప్పుడూ ఓడిపోతుంటారు. అయినా ప్రతిసారీ గెలుపు పాటలే పాడుకుంటారు. రాకాసి బొగ్గులోనూ దైవత్వాన్ని దర్శిస్తారు.

అటువంటి గూడెంలో, అటువంటి జీవితాల నడుమ పుట్టి పెరిగి, బతుకు లోతులను, గతుకుల దారులనూ, బాధల వైశాల్యాలనూ చూశారు స్వర్ణ. ఆ చూపు చివార్న ఒక ప్రాంత జీవన వైవిధ్యమూ, ఆ ప్రాంత జీవుల మెరుపులూ, మరకలూ, అనుభవాలుగా దొరికాయి. ఇంకేం కావాలి ఇంతకన్నా, మంచి కథలను తవ్వి తీయడానికి. తన ఆలోచనలను ఓపెన్ కాస్ట్ చేసి గుండె లోతుల్లోంచి కథా రాశులను తోడి మన ముందు పోయడానికి.

తనకు ఎదురైన సంఘటనల్లో స్వర్ణకు కథలు సమస్యతో సహా దొరికాయి. వాటికి పరిష్కారాలూ రెడీమేడ్‌గా సిద్ధంగా ఉన్నాయి. తన కంటపడ్డ దృశ్యాలను పేర్చుకోవడమే కథకురాలు చేయాల్సింది. అదే చేశారు కూడా. ప్రతి ఘటనలోకి

పాఠకుడిని తీసుకెళ్లగలిగారు స్వర్ణ. అందుకే, నాన్నను బొగ్గుబాయి ఏమైనా చేసిందేమోనన్న భయానికి మనమూ గురవుతాం. లోపల మరేదో నొప్పి దాగుందని హైమావతీ లాంటి వాళ్ల వేదనను తడిమితే కానీ, అర్థం కాదని మనకు పైకి కనపడే గద్దరితనం చెబుతుంది. మద్యం కాలేయాన్ని, గుండెనే కాదు, కుటుంబాన్ని కూడా తినేస్తుందని శీనుగాడు భయపెడతాడు.

స్వర్ణకు ఎదురైన ఈ మనుషులంతా అతి సామాన్యులు. వాళ్ల అనుభవాలూ అతి సాధారణం. కానీ, ప్రతి సాధారణ సంఘటన వెనుక ఒక తాత్వికత పరుచుకుని ఉంటుందనీ కథకురాలు గ్రహించారు. అందుకే, అతి సాధారణ అనుభవాలను కూడా గొప్ప పాఠాలు చేసి ప్రపంచానికి బంగారం లాంటి కథలుగా ఇచ్చారు. ఊహూ.. నల్ల బంగారం లాంటి కథలుగా అందించారు.

బొగ్గు గుండెల్లోని వజ్రం పరిచయం కావాలంటే ఎవరో ఒకరు మసి కావాల్సిందేనన్న రీతిని బోధించే కథలివి. సముద్రం పరిచయం కావాలంటే నదితో పాటు మనమూ ప్రవహించాలనే నీతిని బోధించే కథలివి. పదండి లోపలికి. కొన్ని వజ్రాలు, కొన్ని సముద్రాలు మనకూ దొరక్కపోవు!

ప్రసేన్

(నల్ల బంగారం పుస్తకం ముందుమాటలో కొంత భాగం)

కత్వ

మూసీ మీదికి గంగ తెప్పను తోలు కవీ
ఇప్పటికిప్పుడే తోము ఆర్సెనిక్ కార్బైడ్‌ను
విరిగిపోయిన కత్వా కాళ్లను, చేతల్ని సాఫ్ జెయ్
సక్కగ జెయ్ బారజాపియ్యి
మూతి సక్కగ జెయ్యి కవిత్వానిదీ
కత్వాది.
మనోళ్లందరిదీ నల్లగొండ నలుపేరా
మన రక్తం గూడా నలుపే
కురిసే వాన గూడా నలుపే నాయనా
గోర్వెచ్చని పాటగాడా
మీట జరుపు మెట్టు జరుపు
నలుపెత్తు
నాగలి నవరంధ్రాలకు నాల్కెను మొలిపించు
సర్కార్ తుమ్మలను నాకించు
విషమిరుగుతది రాజకీయులది
పాచి పగలది
పానాది పగుల్లది
పరుపు తాళ్లది ఈనె గుండ్లది
మూసీ.. నా మూసీ
నీ బొడ్డు సంచిని ఎన్నిసార్లని
విప్పి చూసినమే
ముత్తెమంత పానాలను ఎంతని
తవ్వుకుంట పోయినమే అవ్వా
నెయ్యి బువ్వను ఎంతని
సాగదీసుకుంటా ఈడ్చుకుంట పోయినమే
నల్లగుండోల్లము
దునియ మొత్తం సల్లగుండాలని
కోరుకునేటోల్లము
త్యాపత్యాపకూ తాగినోళ్లము
మూసీ మలుపుల నలుపు నీళ్లను
కలేజకు పూసుకున్నోళ్లము
మన భాషకు మాలిష్ తేల్‌తో
మూసీ గుండె సప్పుడుతో
తాగించినోళ్లము
మా అయ్యగాడు.. జెరంత కదులు
కొంచెం జరుపు
పాత తొవ్వని కలుపుకుపో
ఆ కత్వ
నా తొవ్వ
తొల్కపో...
అగొనే...

సిద్ధార్థ
73306 21563

బాగుంది. కవిత్వం కదా... మన జీవితం కదా... చదవాలనిపిస్తుంది. అనుభవించాలని అనిపిస్తుంది. చలం అన్నారు కదా... అనుభవించి పలవరించు అని. ఇప్పుడు వస్తున్న కవిత్వ గాలి కూడా అనుభవించి పలవరించాల్సిన విధంగానే ఉంటోంది. ఆ సమయంలోనూ, ఈ సందర్భంలోనే శిక్షణ తీసుకుని రాసిన కవిత్వం తెలిసిపోతుంది, తేలిపోతుంది. ఇదిగో ఇలా సహజంగా వచ్చిన, వస్తున్న అక్షరాలే ఓ సువాసనతో మత్తెక్కిస్తాయి. ఇలా ఉంది నరేష్ కుమార్ సూఫీ అనే కవి రాసిన కవిత్వం.

సూఫీ తత్వాలహరి

గట్లుంటది..

70వ దశకంలో ఇలా కాదు కానీ, పిడికిలి బిగించాలని అనిపించేదట కవిత్వం చదువుతూ ఉంటే. 80ల్లో మా మటుకు మాకు ఓ కొత్తలోకం కనిపించేది. ఇక 90వ దశకం వచ్చేసరికి తూర్పు వైపు చూపులు సారించేలా చేసేది కవిత్వం. అన్నట్లు కథ కూడా ఇలాగే ఉండేది. శుద్ధ కవిత్వం రాసిన వాళ్లని... చెప్పవద్దు కోపగించుకునేలా ఉండేవి ఆ రోజులు. 'కవిత్వంలో కచ్చితంగా విప్లవ కాంక్ష లేకపోతే అది కవిత్వమే కాదు' అని అనుకునే అమాయకపు రోజులు అవి. ఇక ఇప్పుడు వీస్తున్న ఈ కవిత్వ గాలి వ్యక్తిగతాన్ని సామూహికం చేస్తున్న దశ. ఒకరూ ఇద్దరూ అని కాదు. కవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్న కవులు, కవయిత్రులు చాలామందే ఉన్నారు.

'పెద్దవీ... పొడవైన గొలుసులతో
ఉన్నవీ అయిన సంకెళ్లు
అందంగా మెరిసిపోయే సంకెళ్లు
తయారు చేస్తారు/ రాత్రంతా నిర్విరామంగా అదే పనిగా' అని ప్రారంభిస్తాడు నరేష్ కుమార్ సూఫీ అనే కుర్ర కవి. వీడెవడో భలే ఉన్నాడు. సంకెళ్ల మీద కవిత్వం రాశాడని లోలోపల ఓ కొత్తదనాన్ని ఫీలవుతూ ఉంటాం. పద్యం అలా అలా మనల్ని తనలోకి తీసుకుపోతుంది. హఠాత్తుగా ఇలా అంటాడు.

'అక్కడే తచ్చాడుతున్న యువకుడొక్కడు
ఆకలితో ఇలా అడుగుతున్నాడు
అయ్యా...! మాకు ఆకలిగా ఉంది.. అన్నం
కావాలి.. పని కావాలి
పోనీ...!
మమ్మల్ని బంధించే సంకెళ్లని చేసే పనైనా సరే
మాకు కొంచెం పని చూపించరూ...!!' అని ముగిస్తాడు.

ఈ పద్యం పూర్తి అయిన వెంటనే నా చేతుల్లోంచి పుస్తకం జారిన చప్పుడు. నా చేతులకు సంకెళ్లు వేసిన శబ్దం. ఈ కుర్ర కవి మొత్తం దేశానికే సంకెళ్లు తయారు చేసే పనిలో ఉన్నాడని తెలుసుకుని ఇప్పుడు వీస్తున్న గాలిని గుండెల నిండా పీల్చుకోకుండా ఎలా ఉంటాం. ఉదయం ఈ పద్యం చదివాక పుస్తకం వైపు చూడాలనిపించదు.

కానీ, గదిలో టేబుల్ దగ్గరో, కిటికీకి ఆనుకునో.. పొద్దున చదివిన పద్యం దగ్గరే పుస్తకం రెండు చేతులు చాచినట్లుగా విప్పారి బోర్లాపడుకునో ఉంటుంది కదా... దానికేసి చూసి ఇంకొక్కటి చదువుదాం. ఏం చదువుతామంటే...

'గుండెలు పగిలి రోదించే తల్లులనీ,
పంటల కోతలని వదిలి చెట్టుకు పూసిన
రైతులనీ పలకరించే కదా వచ్చావు
పూవులని వెతికే వసంతాలనీ,
వెన్నెల వాసన లేని శరత్తులనీ
హత్తుకునే కదా నడిచావు
ఉరి కొయ్యలనీ, రక్త మలిన వధ్యశిలల్నీ
ముద్దాడే కదా వచ్చావు
ఇక ఈ చల్లని రాత్రి నా సమాధి మీద విశ్రమించు'

అని అనిశ్చితంగా చెబుతాడు. మాటిమాటికీ చొక్కాలేం మారుస్తాం. ఉదయపు చొక్కా గుండెలపై ఎండి ఓ మచ్చలా మిగిలిన చోట మళ్లీ తడుపుకుంటాం. అమ్మ లేని వాళ్లం కదా... ఎవరు చెబుతారు... 'అలా మాటిమాటికీ తడుపుకోకూడదురా' అని. ఇతగాడికి తెలియదు. ఈ నరేష్ కుమార్ సూఫీ ఏడిపిస్తూనే ఉంటాడు. ఈ కుర్ర కవి పెద్ద ఆరిందాలా మాట్లాడుతూ ఉంటాడు చాలాసార్లు. మూడు పదుల వయసుకే మురిసిపోతూ ఉంటాడు అన్నీ తానే అని. మళ్లీ ఓ వైరాగితనంతో..

'రాత్రిని చీకటిని వేరు చేయలేక
పగటినీ వెలుతురునీ తిరస్కరించనూ లేక
ఆడుతుంటిని నాయనా.. అనివార్య దుఃఖపు ఆట
జజ్జనకరి జన్ అని జనం మధ్యలోనే'

ఇతగాడితో మాట్లాడిన తర్వాతో, కలిసిన తర్వాతో ఇతగాడు బ్రహ్మ సృష్టి కాదు గాక కాదు... అలాగని విశ్వామిత్రుడి సృష్టి కూడా కాదని అర్థమవుతుంది. మరి ఈ వృద్ధ కుర్ర కవి ఎవరూ అనే తండ్లాటలోనే కాలమంతా గడిపేస్తాం. ఈ నరేష్ కుమార్ సూఫీ మాత్రం తంబూర మీటుకుంటా ఇరానీ ఛాయ్‌లో పడి తన గానాలను ఆలపిస్తూంటాడు.

ముక్కామల చక్రధర్
99120 19929